# గంజాయి గొట్టాలు

రాత్రి మూడుగంటలకి లాడ్జిలోంచి బయటకొచ్చి నిలబడ్డాను. అప్పటిదాకా కంటిమీద కునుకు లేదు అయిదు గంటలకి రైలు. రిక్షా చంద్రరావు ఎక్కడికి వెళ్ళాడో?

సాయంత్రంనుంచీ కొండచిల్లడేలా కురుస్తోంది వాన. అరగంటక్రితమే మోగిమోగి అలసిపోయిన రిక్షావాడి గంటలా కురిసి కురిసి అలసిపోయి ఆగిపోయిందివాన, సమస్యలతో నిండిన మనసులా, ఆకాశం యింకా మబ్బులతోనిండి చిందరవందరగా. గందరగోళంగా వుంది.

కరెంటుపోయి కన్నుమూసినా, కన్నుతెరిచినా తేడా లేనంత చీకటి. ఆ చీకట్లో- రిక్షాలు లాడ్జిముందు బారులు తీరిన శవాల్లా ఉన్నాయి. ఆ రిక్షాల్లో సగంతడిసి, ముడుచుకు పడుకొని వణుకుతున్న ప్రాణాలున్న శవాలు.

చెట్లు ఆకులు- అప్పటిదాకా ఆ దృశ్యాన్ని చూసి ధారగా కన్నీరు కార్చి- యింక ఏడ్చే ఓపికలేక- కార్చడానికి కన్నీళ్ళులేక ఆగిఆగి ఒక్కో నీటిబొట్టును రాలుస్తున్నాయి.

కిల్లీకొట్టు బడ్డీ అడుగున అడుకున్న పిచ్చిసుబ్బులుకి మెలుకువవచ్చి తనలో తను నవ్వుకుంటుంది. మధ్యలో చీకటితో మాట్లాడుకుంటోంది. అలసిపోయిన ఆకాశానికి, నిద్రపోతున్న లోకానికి జోలపాడుతుంది.

''నిన్నటి రాజా యీయేలా–బూజయ్యా పోనాడు.
నిన్నటి కంత్రీ యివేలా–మంత్రయ్యా పోనాడు.
నిన్నటి మంత్రీ యీయేలా– ఊరకుక్కకై పోనాడు.
నిన్నటి సీతమ్మీయేలా– లంజయ్యా పోనాది.
నిన్నటి లంజీయేలా– గంజిలేక గంజైపోనాది."

'నోరుమూసుకుపడుకోయహా!' కసిరాడో రిక్షావాడు

'లంజల తార్పుకు బతికే నువ్వా– లంజల మంత్రివే అవుతావ్ రా'

'ఒళ్ళు కొవ్వెక్కేడుతున్నావ్ లంజా!" మరో రిక్షావాడు కసిరాడు.

'నాకూ చలి చలిగానున్నాదీ– నాకో బేరం చూడరనూవ్వా!'

విరగబడి నవ్వేసింది పిచ్చిసుబ్బులు.

'దాన్ని కదిపితే కందిరీగలతుట్టయి పోద్దిరా!
వూరుకోండేస్'

మండలించాడు– నిద్ర చెడిన మరో రిక్షావాడు.

పిచ్చిసుబ్బులు పాట పచ్చినిజాలపుట్ట అనిపించింది. సుబ్బులు హరిశ్చంద్రుడు కాదు– గాంధీకాదు– పిచ్చిది. అయినా నిజాల్ని–చరిత్రలోని నిజాల్ని–మనుషుల బతుకుల్లోని–నిజాల్ని తనకి తోచినప్పుడు–ఏమీ తోచనప్పుడు నిర్భయంగా–

నిప్పుల్లా చెరుగుతుంది. వాక్స్వాతంత్ర్యాన్ని తు. చ. తప్పకుండా నాలుగుంటాల ఆచరిస్తుంది. ఆర్డినెన్సులు, ప్రివెంటివ్ డిటెక్షన్ చట్టాలు దాన్నేమీ చెయ్యలేవు- అసలవి దాని జోలికి రావు. దాని కలాంటికి లైసెన్స్ వుంది.

సుబ్బులు పాడినట్లు నిన్నలా నేడుండదు అనిపించింది 'నిన్నలా నేడుండనప్పుడు - నేడులా రేపెందుకుంటుంది?' అనుకున్నాను.

మార్పు సహజం. ప్రకృతిలోను మనిషిలోను మానవ చరిత్రలోను మార్పు. ఎవ్వరు ఊహించని మార్పు- కొందరు ఆశించినమార్పు- ఎప్పుడో ఒకప్పుడు.........

అందుకే నా లోనే మార్పు- నేనూహించని మార్పు,

పెద్దవయసు లేకపోయినా, నేను పెద్దమనిషిని- నిన్నటి దాకా నాకంటెచిన్నవాళ్ళందరికి నేను పెద్దమనిషిని నా కంటె పెద్దవాళ్ళకి నేను మధ్యతరగతిలో తెలివైనవాడ్ని- కలుపుబడి కలవాడ్ని- బ్రతకనేర్చినవాడ్ని- రాజకీయాల్లో పిందెను.

నా గత చరిత్రకి సమాధి కట్టి, నా క్రొత్తచరిత్రకి పునాది వేసుకోడానికి నిశ్చయించుకున్న సందర్భంలో నాకు వీడ్కోలునిస్తూ పండగ చేశారు నామిత్రులు. నాపెద్దమనిషి హోదాకి తగినట్లు- నారకరకాల ఆకళ్ళను తీర్చడానికి - ఆ రాత్రిని నేను జీవితపు తుదిఘడియల వరకు గుర్తుంచుకునేలా వాళ్ళ సరదాలుకూడా తీరేలా - నాకోసం నానలుగురు మిత్రులూ చేసిన పెద్ద పండుగ- పంచపాండవుల రాజసూయంలా మేమైదుగురం చేసుకున్న జల్సా పండుగ.

జల్సాపండుగలో ... ...

అయిదుగురం తాగాలి.

రక్తంలాంటి బ్రాందీని- నరాల్ని పొంగించి, రక్తాన్ని పరుగెత్తించి, నిజాల్ని పలికించే బ్రాందీని...

ఎంత?

ఎవడెవడికి ఎంతెంత కావాలో అంత- పొట్టలో పట్టినంత- ఒక్కొక్కడు చంద్రమండలానికి చేరగలిగేటంత- చేరి కప్పలా నేలమీద కూలిపోయేటంత.

అంతేకాదు-

అయిదుగురు గువ్వల్లాంటి పిల్లలు-

ఉంగరాల జుట్టుది.

ఎత్తు పిర్రలది

నిడువు రొమ్ముల్ది.

రిష్టువాచీది.

గోలెం కడుపుది

అంతా కిలకిల నవ్వేపిల్లలు. తల్లులే అయినా మాముందు పిల్లల్లా నవ్వేపిల్లలు- యింటిదగ్గర పిల్లలఏడుపుల్ని మరచిపోయి నవ్వగలిగే పిల్లలు మాకోసం- కాదు మేమిచ్చే డబ్బుకోసం- కాదు. వాళ్ళపిల్లలకో, ముసలి తల్లికో, చిన్న చెల్లెలికో, చదువుకునే తమ్ముడికో అక్కరతీర్చే డబ్బు కోసం వ్వే పిల్లలు. రాని నవ్వును తెచ్చుకొని- పుట్టని కోరికల్ని

పుట్టించి – శరీరంలోని ప్రతి అణువును మాకోసం పొంగించి. మమ్మల్ని కవ్వించే పిల్లలు– మాముందు ఏమీ దాచుకోని పిల్లలు.

ఒక్కొక్కళ్ళకి ఒకపిల్లకాదు. మేం పంచపాండవులం. పంచపాండవులకి అయిదుగురు ద్రౌపతులు– ప్రతిపిల్లా ఓ ద్రౌపతి.

అందులోనే మజా...

సాధువుల మఠంలో గంజాయి గొట్టాల ఆట...

అది ఆనాటి విందు: నామిత్రులు నాకిచ్చిన వీడ్కోలు విందు.

అది చిన్న కుటుంబీకుడి పెళ్ళిభోజనం కాదు.

గుమస్తా ఆదివారం భోజనం కాదు.

నవనాగరికుల విందు!

పెద్దమనుషుల విందు!!

అది కడుపున కాల్చే అకల్ని తీర్చేది కాదు. నరాల, శరీరాల తృష్ణను తీర్చేది విందు.

మిా దైపోయింది.

లేని ఓపిక తెచ్చుకొని. వదలని మైకాన్ని వదిలించుకుని లాడ్జీలోంచి బయటికొచ్చి, గేటులో రిషా చంద్రావు కోసం నిలబడ్డాను– నిన్న తెంపిన తోటకూర కాడలా_ చార్ మినార్ పెట్టిలోని ఆఖరి సిగరెట్టులా.

ఎడమవైపు కిరోసిన్ బుడ్డి వెలుగు.

'అరేయ్ చంద్రరావ్!' గట్టిగా పిలిచాను.

'అయ్యా!'

'సామాను రిక్షాలో పెట్టు' అని, లోపలికి నడిచాను

అగ్గిపుల్లగీసి, కొవ్వొత్తి వెలిగించి చీకటిగానున్న గది లోకి అడుగు పెట్టాను. వెలిగి వెలిగి వంకరగా కరిగి. అరి పోయిన కొవ్వొత్తిలా-మావాడి పక్కలో పడుంది వుంగరాల జుట్టుది.

'యింట్లో చీమలు కుడుతున్నాయని వీధినపడి గద్దల పాలైనట్టుంది నా బతుకు కట్టుకున్నవాడు రోజూ తిడుతున్నాడని వీధిన పడినందుకు బాగానే అయ్యింది నాకు' అనుకుంటున్నట్లుగా ఉంది దానిముఖం.

ఎత్తుపిర్రలది- కాల్చిపారేసిన సిగరెట్టుపీకలా పడుంది. మాగన్నుగా కునుకు పట్టినట్టుంది అంతలో ఉలిక్కిపడి కళ్ళు తెరుస్తోంది. గుడిశలో చింకిరిచాపమీద ఆరు నెలల గుడ్డు ఆకలేసి కడుపుబ్బేలా ఏడుస్తున్న ఏడుపు చెవినపడిందేమో!

కవిలిన వంకాయలా పడున్న నిడుపురొమ్ములది నిద్రలో భయపడుతోంది. పోలీసు కల్లోకనపడి 'నిన్న రైడ్‌లో నిన్ను తప్పించిన దానికి పదిరూపాయలు- అపైన నాకివ్వాల్సిన మామూలు యివ్వకపోతే రేపురాత్రి రైడ్‌లో నువ్వు బుక్కవ్వడం ఖాయెం' అన బెదిరిస్తున్నాడేమో.

కాలికింద నలిగిన అగ్గిపెట్టిలా ముడుచుకు పడున్న

రిక్షావాడి దాని ముఖంలో గూడుకట్టుకున్నది గుబులు. గుండెల్లో కాబూలీవాడు చిందులు తొక్కుతున్నాడేమో?

'వాడీవుంటే కాలేజీ పిల్లనుకొని, మంచి బేరాలొత్తా' యని కాబూలీవాడి దగ్గర రూపాయకి పావలా వడ్డీమీద కంపెనీ యజమాని పూర్ణతిలకం అప్పు యిప్పించినట్టుంది. వాడి బాకీ తీరుతుందా? నల్లిలా పట్టుకున్న వాడొదులుతాడా? అను కుంటున్నది మనసులో.

మాసిపోయిన బుట్టబొమ్మలా- మంచాన్ని ఆక్రమించు కున్న గోలెంకడుపుది గుర్రుపెట్టి నిద్రపోతోంది. అంత నిద్ద ట్లోనూ ఉలికిపడుతోంది. దాని అసక్ మొగుడు తాగుబోతు పెంటయ్య- తగిలేచోటు తప్పేచోటు లేకుండా మోకార్తో పొడుస్తున్నట్టున్నాడు. వాడ్ని మోజుకొద్దీ కొత్తలో రోజుకి అయిదురూయలిచ్చి కొనుక్కుంది యిప్పుడు బేరం రాకపోతే ఓ పోటూ బేరాని కెళ్ళొచ్చి పొద్దున్నే మొత్తం డబ్బు వాడి ముఖాన కొట్టకపోతే మరోపోటు- ఆడితో ఎట్టా యేగాలో- అనుకుంటున్నట్టుంది నిద్దట్లో.

చంద్రరావ్ సామాను తీసుకెళ్ళి రిక్షాలో పెట్టాడు. మావాళ్ళతో వెడుతున్నానని చెప్పాలని నా తాపత్రయం. కాని, వాళ్ళు మరోలోకంలో వున్నారు. బయటికొచ్చి, రిక్షా ఎక్కి కూర్చున్నాను.

తడిసిన రోడ్డుమీద, గోతుల్లో పడుతూ, లేస్తూ రిక్షా బరువుగా నడుస్తోంది. ఎక్కడో మెరిసింది. ఓ బిచ్చగాడు సైడు కాలువ ప్రక్కన కూర్చున్నాడు. ఓ కుక్క వెంటబడితే

కంకర్రాయి విసిరాడు. ఆరాయి దాని నెత్తికి తగిలి 'కియ్యో-కియ్యో' అని అరుస్తూ పరుగెత్తింది. యుద్ధంలో నెగ్గిన వీరుడిలా తృప్తిపడ్డాడు బిచ్చగాడు. నారిక్షా వాడి పక్కనించే వెళుతూ రోడ్డుమీద మురికినీళ్ళని వాడి ముఖంమీదికి చిమ్మింది. వాడినోట్లో మురికినీళ్ళుపడి- తిట్టబోయి- వీలుపడక 'త్ఫూ' అంటూ వుమ్ముతున్నాడు.

నారిక్షా మరికాస్త ముందుకి నడిచింది. దెయ్యంలా ఓలారీ ఎదురొచ్చి రిక్షాచంద్రావ్వని, నన్ను, రిక్షాని రోడ్డు మీద మురికి నీళ్ళతో తడిపేసింది.

'జీవితంలో అడుగడుగునా వర్గపోరాటమే' అనిపించింది నాకు.

లారీ చిమ్మిన నీళ్ళతో తడిసిపోయాను. చలిగాలి విసురుగా వంటికి తాకుతోంది. మైకం బాగా దిగిపోతోంది. మెదడు రంగులరాట్నంలా తిరుగుతోంది. గుర్రం- ఏనుగు- పులి- సింహం లేడి- ఒకదాని తర్వాత ఒకటి . .

మరో మెరుపు మెరిసింది. నాకు పరిచయమైన సందు వందగజాల్లో

విందులో అస్పష్టంగా ఉన్న లోటుకు కారణం ఇప్పుడు తెల్సింది. నాకు నచ్చిన మనిషి సుగుణ. సుగుణ విందుకి రానందట. ఎందుకో? ఓ సారి చూసొస్తే.. గడియారం చూసుకున్నాను, ఇంకా గంట టైముంది.

'సుగుణ యింటికి పోనియ్ రా!' అన్నాను. దూరంగా

వెళ్ళిపోతున్నాను. అందుకే ఆఖరిసారిగా చూసిపోవాలని పించింది.

తుమ్మలావ- మురికిపేట రిక్షా నీళ్ళలో యీదుతోంది. మోకాలు లోతు నీళ్ళల్లో, గుడిసెముందు ఆగింది రిక్షా. దిగి లోపలికెడితే... వెళ్ళాలి ఆఖరిసారిగా ఓసారి చూసి- ఓసారి... ఆఖరిసారి... మళ్ళీ ఎప్పటికో...

గుడిశలోపలికి అడుగుపెట్టాను,

'ఎవరూ?' అంది సుగుణ.

'నేనే'

'మీరా! రండి' అంటూ లేవబోయింది. నరాలన్నిటిని పెనవేసి ఏదో పెద్ద దుంగను నెత్తినట్టు- తన చిన్నశరీరాన్ని పైకిలేపి కూర్చోబోయింది.

కాని కదలలేక పోయింది.

కొడిగట్టిన కిరసనాయిలు దీపం- చమురులేక- లంఖనాలు చేసినట్టు నీరసంగా మూలుగుతోంది. ఆ మసక వెలుగులో సుగుణ ముఖంలోకి చూశాను కళ్ళు లోతుకుపోయి-కుక్కి- నులకమంచంలో సుగుణ ఎంతో దీనంగా, తడిసిపోయిన సుద్ద ముక్కలా పాలిపోయినట్టు కనపడింది నాకు, దీన్నంతనీ దాసుకొని బలంగా, అందంగా, సుఖంగా నవ్వుతూ వున్నట్టు కనపడాలని ఆమెకళ్ళు-చేతులు- వళ్ళుపడే తాపత్రయం...?

'కూర్చొండి' అంటు తనపక్కలో నాకు కాస్త చోటిచ్చింది.

పక్కలో కూర్చున్నాను. మామూలుగా నా చెయ్యి సుగుణ గుండెలమీదికి వెళ్ళింది. కోసి తక్కెడలో పెట్టిన మాంసపు ముద్దల్లా- మెత్తగా- చల్లగా? ఛ- ఏమిటిది? అనిపించింది.

నా చేతిమీద తన చేయివేసి నొక్కింది. చేయి చల్లగా వుంది. యిదివరకటి వేడీ, బిగి ఏది? లేదు.

ఇంతలో ఎక్కడో ఉరిమింది పెద్ద మెరుపు.

గాలికి గుడిశమీది ఆకులు వూడిపోయి, సందుల్లోంచి వెలుగు గుడిశలోకి తొంగిచూసింది. దీపం చిన్నబోయింది.

కాళ్ళదిక్కు మంచంకింద రక్తపుమడుగు.

'ఆ రక్తం......?' అన్నాడు కంగారుగా.

'వంట్లోదే కంగారెందుకు? - సుగుణ బలహీనంగా నవ్వింది.

'ఛ. ఎందుకు చేశావ్ ఈ వెధవపని ?'

'యిది వెధవపనా ? యింకా మంచిపనంటావేమో అనుకున్నాను. నాకు తెలీకడుగుతా-పుట్టబోయే బిడ్డ ఎవరిబిడ్డ? నాకే తెలీదు. మీకెలా తెలుస్తుంది? కాని నా లెక్క ప్రకారం నీకూ ఆరక్తపుముద్దలో వాటా వుండే వుంటుంది. ఒకవేళ నేను నిజంగా బిడ్డనికంటే మీ బిడ్డ అని చెప్పుకుంటారా ?'

ఏమిటి నువ్వనేదన్నట్లు ఆమె ముఖంలోకి చూశాను.

'భయపడకండి ! అలా ఎవ్వరూ ఒప్పుకోరు. తప్పు చేస్తే పరువు పోదుగాని తప్పు ఒప్పుకుంటే పరువు మట్టిగొట్టుకు

పోదూ ? అందుకే అందరూ కలిసి ఆ పుట్టబోయేవాడ్ని లంజ కొడుకంటారు. మీరూ అలాగే పిలుస్తారు. అందుకే ఆపిలుపు నాకు నచ్చక- నేను లంజగా బతికి. లంజగా చచ్చినా నా నీడ వాడిమీదపడి వాడ్ని లంజకొడుకని లోకం పిలువడం సహించ లేక...

'అందుకోసం యిలా చేస్తావా ?"

'యింకెలా చేయమంటారు? హాస్పిటల్ కెడదామంటే డబ్బులేక నాటు వైద్యం చేసాను లేచే ఓపిక లేదు. అందుకే పైనుంచి చినుకులు పడి పక్క తడుస్తున్నా, నే తడుస్తున్నా యిలా పడున్నాను; పోనీలెండి! నా బాధ నిత్యమూ వుండేదే' అంటు నాచేయి తీసుకొని తన ఛాతిమీద పెట్టుకొంది.

ఆమెవళ్ళు చల్లబడుతోంది. నా వళ్ళు చచ్చిపోయింది

'సుగుణా నీకేమైనా అయితే...' అని ఏదో అన బోయాను.

'ఏదైనా అయితే ప్రభుత్వం పడిపోతుందా? మీలాంటి వాళ్ళు తా ముండమోస్తారా' పురాణాల్లోని పతివ్రతల కథలకి కాంతి తగ్గిపోతుందా ? యేమి ఫరవాలేదు' అంది సుగుణ పెద్ద జ్ఞానిలా.

నేను చాలరోజులు అనుభవించిన సుగుణ, చచ్చి పోతుందేమో? ఆమెకి మొగుడేవుంటే, ఏదో అమ్మో, అప్పుచేసో, ఎలాగోలాగ డబ్బు తెచ్చి వైద్యం చేయించి బ్రతికించుకుంటాడు. మరి నేను? మొగుడ్ని కాను. కాని మొగుడికంటె నేను సుగుణతో యేం తక్కువ అనుభవించాను.

ఏ మొగాడైనా ఏ ఆడదాన్ని మాత్రం- సుగుణను నేను యిన్నాళ్లు చేసినదానికంటె ఏం చేస్తాడు? హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి. కాని ఎలా? ఎవరనీ ప్రాయించాలి? ఎవరైనా చూస్తే? ఫరవాలేదు. చీకటేగా!

రిక్షాలో కూర్చోబెట్టి ప్రయివేట్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాను. డాక్టర్ నాకు తెలుసు ప్రత్యేకంగా ఓగది తీసుకున్నాను. డాక్టర్ వెంటనే యివ్వాల్సిన మందులు యిచ్చింది. వెచ్చగా పడుకుంది సుగుణ. నా దగ్గరున్న డబ్బు కొంతయిచ్చి, మిగిలింది ఎంతైతేఅంతా తరువాత పంపిస్తానని చెప్పాను డాక్టర్‌తో. జాగ్రత్తగా చూడమన్నాను సుగుణ మంచం దగ్గరకెళ్ళాను.

'బాగా సులువుగా వున్నతర్వాత యింటికివెళ్ళు' అన్నాను సుగుణతో

సుగుణ నా ముఖంలోకి చూసింది.

'మరి నేవెళ్ళోస్తా' అంటూ నాలుగడుగులు వేశాను.

'మాట'- వెనక్కి- తిరిగాను.

'డాక్టరమ్మ వెళ్ళిపోయిందా?'

'ఆ.'

'ఎక్కడ్నుంచో వానలో తడిసి నా కోసం వచ్చారు. చాలా డబ్బు ఖర్చుపెట్టారు నాకోసం. దూరంగా ఎక్కడికో వెళ్ళిపోతున్నారని చంద్రరావు నాతో చెప్పాడు.'

'అయితే!'

'ఓ సారి వుండి మీమనసు తీర్చుకొని మరీ వెళ్ళండి. యిప్పుడు కాస్త సులువుగానే వుందిగా ఫరవాలేదు.'

ఆ మాటల్లో నాకర్థంకానిది, నేచెప్పలేనిది యేదో వుంది. నేను నిలుచున్నచోటనే అలా బొమ్మలా నిలబడి పోయాను. అప్పుడు నా శరీరంలో ప్రవహిస్తున్నది రక్తంకాదు. కరిగి ఎర్రగాపల్చగా వున్న యినుం-అది సుగుణ మంచితనమో! కృతజ్ఞతో, అమాయకత్వమో, సుగుణ నన్ను ఖరీదు కట్టిన పద్ధతో నాకు తెలియదు. కాని 'నేనూ మనిషినే' అని దిక్కుల అంచుల వరకు వినిపించేటంత గట్టిగా అరవాలని పించింది. గొంతు పెగల్లేదు.

కాని అనుకున్నాను నాలో నేననుకున్నాను యీవాన-తుఫానై సముద్రాల్ని పొంగి- భూమిని ముంచేసి, యీ బ్రతుకుల్ని- యీ బ్రతుకుల కథల్ని- యీకథల్లోని వ్యథల్ని తుడిచిపెట్టి-

కొత్తవ్యవస్థని- మనిషి మనిషిని కొనని వ్యవస్థని-మనుషులందరూ మనుషులుగా బతికే వ్యవస్థని సృష్టిస్తే! ఎప్పటికో...ఎప్పటికో...

అనుకుంటూ ముందుకి బలంగా అడుగులు వేసుకుంటూ నడిచాను

నా వెనుక సుగుణ వూడిపారేసిన 'గంజాయి గొట్టంలా మంచంమీద పడుంది.